మట్టి అక్రమ రవాణా



మట్టిని తవ్వడంతో ఏర్పడిన భారీ గుంత

- కంకర క్రషర్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు
- కొంత ప్రైవేటు స్థలాల్లోనూ..
- పట్టించుకోని అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌ల పరిధిలోని ప్రభుత్వ భూముల నుంచి రాత్రిళ్లు యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు అక్రమార్కులు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏకంగా.. ఏడాది నుంచి దందా కొనసాగుతుందంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో స్పష్టమవుతుంది. ఒక ముఖ్యప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ పరిధిలోని కంకర క్రషర్‌లకు 286 సర్వేనంబర్ గల ప్రభుత్వ భూములు, మరిన్ని ప్రైవేటు భూముల్లోని మట్టిని కొంతమంది అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. రాత్రికి రాత్రే భారీ టిప్పర్‌ల ద్వారా రవాణా చేస్తున్నారు. పది రోజుల నుంచి రోజూ రెండు వందల టిప్పర్‌ల ద్వారా తరలించుకుపోతున్నారు. శివానగర్‌లోని ఎల్‌ఈడీ పార్కులోని పలు పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఇదంతా ఓ ముఖ్య నేత కనుసన్నల్లో జరుగుతుంది. అయినా ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోయారు. ఏడాదిగా దందా కొనసాగుతున్నా అధికారులు ఇటు వైపు చూడకపోవటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అక్రమ వెంచర్ తొలగించాలని ధర్నా



నారాయణఖేడ్: మన ఊరు వెంచర్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్ శివారులో నీమ్స్‌బోరో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన ఊరు అక్రమ వెంచర్‌ను తొలగించాలని రైతులు, తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవులు, ధర్మ సమాజ్ పార్టీ ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అలిగె జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వెంచర్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేశారని ఆరోపించారు. నిరోధించాల్సిన అధికారులు వారితో కుమ్మక్కు అయ్యారని విమర్శించారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీకి చెందిన తనుజ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీని బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన మల్లన్న, గైబన్న

న్యాల్‌కల్(జహీరాబాద్): బైక్ ఢీ కొని ఇద్దరు కూలీలకు గాయాలైన సంఘటన న్యాల్‌కల్ చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. న్యాల్‌కల్‌కు చెందిన మల్లన్న, గైబన్న గురువారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో న్యాల్‌కల్–మిర్జాపూర్(ఎన్) క్రాస్ రోడ్డు వద్ద వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో మల్లన్నకు కాలు విరుగగా, గైబన్నకు చేయి విరిగింది. క్షతగాత్రులైన ఇద్దరిని చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హద్నూర్ పోలీసులు పరిశీలించారు.

నిందితులను శిక్షించాలి



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న సమతా సైనిక్‌దళ్ నాయకులు

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలం.. బడంపేట నర్సింహులు హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సమతా సైనిక్‌దళ్ నాయకులు అన్నారు. గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ మాట్లాడుతూ, ఈనెల 18న బడంపేట నర్సింహులును కొంత మంది కొట్టి చంపారన్నారు. నిందితులు అందరినీ అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు బాల్‌రాజ్, బండి మోహన్, శ్రీనివాస్, విక్కి, గోపాల్, సాయి, పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

నారాయణఖేడ్: మనూరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జూన్ 3న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలు మంగమ్మ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

‘హద్దు’లు దాటుతున్న దందా



పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

- యథేచ్ఛగా సరిహద్దులు దాటవేత
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

జహీరాబాద్ టౌన్: రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. వ్యాపారులు అక్రమ రవాణా ద్వారా పొరుగు రాష్ట్రాలకు తరలించి అధిక లాభాలు పొందుతున్నారు. బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న క్రమంలో అధికారులు పట్టుకోవడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. నిరుపేదల కోసం ప్రభుత్వం ఆహార భద్రతా పథకం అమలు చేస్తుంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున కుటుంబం మొత్తానికి రేషన్ బియ్యం సరఫరా చేస్తుంది. లబ్ధిదారుల్లో అధిక శాతం మంది రేషన్ బియ్యం తినడం మానేశారు. సర్కార్ అందిస్తున్న బియ్యం వద్దు అనడం ఎందుకని ప్రతి నెలా తీసుకుంటున్నారు. దీంతో వారి వద్ద నిల్వలు పేరుకుపోతున్నాయి. అదే అక్రమార్కులకు వరంగా మారింది. కిలో రూ. 10 నుంచి 12 లకు వారి నుంచి కొంటున్నారు. ఇలా కొన్న బియ్యం వ్యాపారులకు విక్రయిస్తే వారు గోదాంలో నిల్వ చేసి పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

జోరుగా వ్యాపారం

జిల్లాలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతుంది. నిత్యం అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. దీంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది. వ్యాపారులు ప్రజలు, డీలర్ల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి చీకటి పడిన తరువాత గోదాంలకు తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున నిల్వలు పేరుకున్న తరువాత లారీల్లో రాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు ఇళ్లనే గోదాంలుగా మారుస్తున్నారు. ఇటీవల పోలీసులు, రెవెన్యూ అధికారులు పక్కా సమాచారంతో



జహీరాబాద్ మండలంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం(ఫైల్)

దాడులు చేసి గోదాంలలో నిల్వ ఉంచిన క్వింటాళ్ల కొద్దీ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం సీజ్ చేసి కేసులు పెట్టినా దందా ఆగడం లేదు. రేషన్ బియ్యం దందా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గట్టి చర్యలు తీసుకుంటున్నాం

రాష్ట్ర సరిహద్దులో గల మాడ్గి చెక్‌పోస్టు వద్ద పోలీసు నిఘా పెంచాం. అక్రమంగా బియ్యం తరలిస్తే తనఖీలు నిర్వహించి పట్టుకుంటున్నాం. ఇప్పటికే పలు కేసులను నమోదు చేశాం. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ముమ్ముందు కూడా గట్టి చర్యలు తీసుకుంటాం.

– రాంమోహన్‌రెడ్డి, డీఎస్పీ, జహీరాబాద్

ఈ ఘటనలు నిదర్శనం

- జహీరాబాద్ మండలంలోని రాష్ట్ర సరిహద్దులో గల మాడ్గి చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు ఈనెల 13న గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు.
- జిల్లాలోని వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ వద్ద సివిల్ సప్లయ్ అధికారులు ఈనెల 28న 101 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.
- ఇటీవల జహీరాబాద్ మండలం హోతి(బి)లో నిల్వ చేసిన 20 క్వింటాళ్ల బియ్యం, మాడ్గి చెక్ పోస్టు వద్ద రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న 240 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.
- మరో సంఘటనలో గుజరాత్‌కు తరలిస్తున్న 232 క్వింటాళ్ల బియ్యాన్ని చెక్ పోస్టు వద్ద పోలీసులు స్వాధీన పర్చుకున్నారు.
- గతేడాది ఆగస్టులో అక్రమంగా తరలిస్తున్న 230 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇలా క్వింటాళ్ల కొద్దీ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్ ఫోర్స్ అధికారులు, పోలీసులు, పౌరసరఫరా శాఖ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

యువతీ యువకులు బాగా చదవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



అభియాన్ సంస్థ తరఫున గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీ యువకులు బాగా చదివి ఉద్యోగాలు సాధించి ఖేడ్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకాంక్షించారు. నారాయణఖేడ్‌లోని గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన పలు పుస్తకాలను సర్వోదయ గ్రామసేవ అభియాన్ సంస్థ వితరణ ఇవ్వగా ఎమ్మెల్యే తన చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి అభ్యర్థులు పోటీ పరీక్షల పుస్తకాలను కొనే ఆర్థిక స్తోమత లేదన్నారు. ఈ సందర్భంగా దాత అభియాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారంశంకర్ వైపై సదుపాయం కల్పించడంతోపాటు కంప్యూటర్ వితరణ చేయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాయకులు అవుటి శంకర్ ముదిరాజ్, కిషన్‌నాయక్ రాథోడ్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో అప్రమత్తం



ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

నారాయణఖేడ్: రైతులు విత్తనాల కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ నూతన్ కుమార్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మనూరు మండలం ఎస్.జీ హుక్రానలో విత్తన ఎంపిక, కొనుగోళ్లపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొంటే సదరు దుకాణదారుడి వద్ద రశీదు తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే విత్తనాలను కొనాలన్నారు. లూజుగా ఉన్న బస్తాల్లోని విత్తనాలను కొనుగోలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో రైతులు నర్సింహారెడ్డి, మారుతి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

మనూరు మండలంలోని అతిమ్యాల్‌లోని శ్రీ కేతకీ సంగమేశ్వర, దోవూరులోని శ్రీరామా ట్రేడర్స్ ఫెర్టిలైజర్ దుకాణాలను ఏడీఏ నూతన్ కుమార్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డిలు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరుబాట

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని శాండ్విక్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో గురువారం శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. విశాల భారత కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడమే లక్ష్యంగా సీఐటీయూ ఏర్పడిందన్నారు. నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన అనేక ఐక్య ఉద్యమాల్లో కీలక పాత్ర నిర్వహించిందని కొనియాడారు. తద్వారా పాలకుల కార్మిక వ్యతిరేక విధానాల పట్ల కార్మిక వర్గాన్ని చైతన్యపరిచిందన్నారు.



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి

రాబోయే రోజుల్లో సంఘం సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల పై మరింత ఉధృతమైన పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. శాండ్విక్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాత్రుల సమయంలో సైతం సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్నారు. కాగా, వేసవిలో రాత్రుల సమయంలో వాడకం ఎక్కువగా ఉంటుంది. వినియోగదారులు వేడిని తట్టుకోలేక ఏసీలను వాడుతున్నారు. ఆ సమయంలో ఎక్కువ శాతం మంది వాటిని ఆన్ చేస్తుండటంతో ఒక్కసారిగా సబ్‌స్టేషన్‌పై అధిక లోడు పడి ట్రాన్స్‌ఫార్మర్‌లు ట్రిప్ అవుతున్నాయి. వీటి కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీనిని పూర్తి స్థాయిలో నివారించేందుకు ఏఈ స్థాయి అధికారులతో పాటు సిబ్బంది నిత్యం రాత్రి సమయంలో ప్రత్యేక విధులను నిర్వహిస్తున్నారు. పని ప్రాంతాల్లో ఫొటోలు దిగి ఉన్నతాధికారులకు పంపుతున్నారు.



రామచంద్రాపురం సబ్‌స్టేషన్‌లో రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇద్దరి అదృశ్యం



రమేశ్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీలో భార్యాభర్తలు రమేశ్ గౌడ్, అనుపమ నివాసముంటున్నారు. అనుపమ ఈనెల 28న సాయంత్రం రామచంద్రాపురంలో ఉన్న తన సోదరుడి ఇంటికి వెళ్లి, అదే రోజు తిరిగి రాత్రి వస్తే ఎందుకు అక్కడికి వెళ్లావని భర్త గొడవపడ్డాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో రమేశ్ కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై బుధవారం రాత్రి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మోసంజీ

– భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం...బిహార్‌కు చెందిన రాహుల్ తన భార్య మోసంజీతో కలిసి బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వలసొచ్చి ఇక్కడే నివాసముంటున్నారు. ఈ నెల 26న పనిమీద రాహుల్ ముంబయికి వెళ్లి ఈనెల 27న తిరిగొచ్చి ఇంట్లో చూస్తే భార్య కనిపించలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ దొరకలేదు. మోసంజీ అదృశ్యంపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్రకటిత కోతలకు నిరసన



తడ్కల్ విద్యుత్ ఉపకేంద్రం కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుత్ అప్రకటిత కోతలకు నిరసనగా.. జమ్గి(కే), ఘన్‌పూర్ గ్రామాల యువ రైతులు తడ్కల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ముట్టడించారు. గతనెలలో సైతం విద్యుత్ సరఫరా అంతరాయంపై లైన్‌మెన్ చెందర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో ఏడీఈకి ఫిర్యాదు చేశామన్నారు. ఒకే ఫీడర్‌కు గాను అధిక గ్రామాలు ఆధారపడి ఉండటంతో సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. కాగా అదనపు ఫీడర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ముట్టడిలో పీరాజీ, పండరి, రఫిఖ్, బాలు, హన్మంతు, గంగారం, జమీర్, సునీల్, మారుతి ఉన్నారు.

డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి : ఏఓ

వట్‌పల్లి(అందోల్): గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని జోగిపేట ఏఓ విజయరత్న సూచించారు. గురువారం అందోల్ మండలం సాయిబాన్‌పేట, అందోల్, జోగిపేటలలో విత్తనాలు కొనే ముందు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విత్తనాలు కొంటే తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు. పంట యొక్క దిగుబడి వచ్చే వరకు భద్రపరచుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్ మీద తేదీలను చూసుకోవాలని సూచించారు.



వట్‌పల్లి(అందోల్): రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయరత్న

అవగాహన అవసరం

జిన్నారం: విత్తనాలను కొనుగోలు చేసే విషయంలో రైతులు తగిన అవగాహన కలిగి ఉండాలని గుమ్మడిదల మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం గుమ్మడిదల, అనంతారంలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విత్తనాలు నకిలీవని అనుమానం వస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన పార్టీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతీ కుటుంబం ఆర్థికంగా బలపడేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మాట్లాడుతూ కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు.



మాట్లాడుతున్న మీసం నాగరాజు

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మెల్యే సునీతారెడ్డి పూజలు



హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ముచ్చర్ల గ్రామ శివారులోని నల్ల పోచమ్మకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారి జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నల్ల పోచమ్మ దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, ఎంపీటీసీ కిషన్‌రావు, నాయకులు శివశంకర్, యాదగిరి, నరేందర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజురెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ సైతం అమ్మకు పూజలు చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ అవగాహన సదస్సు

మునిపల్లి(అందోల్): నాణ్యమైన విత్తనాలతో పంట దిగుబడి సాధించవచ్చని కంకోల్ సెక్టార్ వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య తెలిపారు. గురువారం మండలంలోని మేళసంగ్యం, అంతారంల్లో విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, కూలీలు పాల్గొన్నారు.

◆ తనిఖీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల ఏఓ అధికారి లావణ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చాల్కి చౌరస్తా వద్ద శ్రీసాయి ఎరువులు, విత్తనాలు విక్రయ దుకాణాల్లో ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విత్తనాల నమూనాలను సేకరించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన సమాచారాన్ని బోర్డులపై రాయాలని సూచించారు.

◆ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నేడు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కరెంట్ అధికారులు గురువారం తెలిపారు. రామచంద్రాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బీహెచ్ఈఎల్ యాన్సిలరీ, హెచ్‌ఐజీ, ఎల్‌ఐజీ, బీడీఎల్ మ్యాక్స్ సొసైటీ, ఎంఆర్‌ఎఫ్ కాలనీ, విద్యుత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు. ఉస్మాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సైతం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరాఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

◆ మున్సిపల్ చైర్మన్.. పూజలు



పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో గల దుర్గా భవానీ మాత సహిత నాగలింగేశ్వర దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవాల్లో గురువారం వారు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరసింహగౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానంద్ , జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.